కష్టపడి చదివి..

ఉపకులపతి స్థాయికి ఎదిగి

పీయూ వీసీగా డా.జీఎన్ శ్రీనివాస్ ● నేడు బాధ్యతల స్వీకరణ



పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా రానున్న జీఎన్ శ్రీనివాస్ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ మరోవైపు సాయంత్రం కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అంచెలంచలుగా ఎదిగి ఉపకులపతి స్థాయికి చేరారు.

159 మందిలో..: పీయూకి మే 21 నుంచి రెగ్యులర్ ఉప కులపతి లేరు. ఈ పోస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి అర్హత కలిగిన 159 మంది దరఖాస్తు చేసుకోగా చివరికి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోస్టుకు డిమాండ్ పెరిగింది. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన తర్వాత ఇక్కడ ఉపకులపతి పోస్టుపై అనేక మంది ఆసక్తి చూపారు. అందులో ప్రభుత్వం అనుభవం కలిగిన ఆచార్యుడికి బాధ్యతలను అప్పగించింది.

కుటుంబ నేపథ్యం: శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం కొత్తపల్లి. తల్లిదండ్రులు నర్సయ్య, ఎల్లవ్వ వ్యవసాయం చేసేవారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు గంభీరావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1991లో ఎంసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యలో ఈఈఈ విభాగంలో చేరారు. 1995లో బీటెక్ పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం కింద అధ్యాపకులుగా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం కళాశాల ద్వారా ఎంటెక్ పూర్తి చేశారు. 1997 వరకు సహాయాచార్యులుగా పని చేశారు. 2003లో అనంతపురం జేఎన్‌టీయూలో రెగ్యులర్ పోస్టు కింద అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2006లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడే పని చేస్తూ 2011లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 2022లో సీనియర్ ఆచార్యులుగా అర్హత లభించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ పని చేస్తున్నారు. వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపల్‌గా, పలు కళాశాలలకు మెంటార్‌గా, పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా, పలు పోటీ పరీక్షలకు సభ్యుడిగా, వసతి గృహ మేనేజర్‌గా సేవలు అందించారు.

కొత్త వీసీకి సవాళ్లెన్నో..

పీయూలో పలు సవాళ్లు కొత్త ఉపకులపతికి ఎదురు కానున్నాయి. విశ్వవిద్యాలయం సిబ్బందిపై పూర్తి అజమాయిషీ కరవైంది. కొందరు విధులకు వచ్చినట్లు హాజరు వేయించుకుని బయటకు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తరగతులపై పర్యవేక్షణ, అధ్యాపకుల అజామాయిషీని పకడ్బందీగా చేయాల్సి ఉంటుంది. లా కళాశాలకు గతేడాది అనుమతి వచ్చినా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం ఒక గదిలో 8 మంది ఉంటున్నారు. ఒక గదిలో నలుగురు మాత్రమే ఉండాలి. మరో భవనం నిర్మించినా ఇంతవరకు ప్రారంభించ లేదు. పర్యావరణ విద్యకు తరగతి గదుల్లేవు. కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ కేంద్రాల్లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

● పీయూకి ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తాను. 29 ఏళ్లుగా బోధనా రంగంలో పని చేస్తున్నాను. అన్ని విభాగాల్లో బాగా పని చేసిన అనుభవం ఉంది. అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉంది. వర్శిటీ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తాను.

-జీఎన్ శ్రీనివాస్, పీయూ ఉపకులపతి

21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు: ఎస్పీ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: శాంతిభద్రతలో భాగంగా తమ ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరించుకునేందుకు ఈ నెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసు సంస్మరణ(ఫ్లాగ్ డే) వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని రకాలుగా అమరవీరుల దినోత్సవం, సైకిల్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు, ఉచిత రక్తదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనాలని, ఇందుకు 24వ తేదీ వరకు అవకాశం ఉందని వివరించారు.

ఎరువు.. ఇక కాదు బరువు

మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్

గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఎరువులను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎరువుల సరఫరా కోసం ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. అన్ని ప్రాంతాలకు ఎరువుల సరఫరా సవ్యంగా జరగాలంటే మరో సంస్థ కూడా బాధ్యతలు ఉండాలని ఆలోచించిన వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులను తీసుకొచ్చి రైతులకు తమ కేంద్రాల ద్వారా విక్రయించనుంది.

నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశం: రెండు దశాబ్దాల కిందట ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలను పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసేది. ఇందు కోసం అప్పట్లో జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో అవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సంస్థ ప్రాధాన్యాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

రైతులకు మేలు: మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా ఆగ్రోస్‌తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా ఆగ్రోస్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున ఎరువుల నిల్వ కోసం గోదాములు సమకూర్చుకోవాలి. ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరాభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సహకార కేంద్రాల సంఖ్య పెరగడం వల్ల యాసంగి సీజన్‌లో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయని జోగులాంబ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అంటున్నారు.



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం

ఉమ్మడి జిల్లాలో ఇలా..
- సహకార సంఘాలు: 82
- సాగు విస్తీర్ణం: 18.50 లక్షల ఎకరాలు
- ఎరువుల వినియోగం: 3.94 లక్షల మెట్రిక్ టన్నులు

అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. వివిధ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రం గద్వాలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలైనటువంటి రైతుబంధు, రుణమాఫీని వెంటనే పూర్తిగా అమలుచేయాలని విషయమై మంత్రికి వినతిపత్రం అందించేందుకు ఆయన బయలుదేరారు. కాగా విషయం తెలుసుకున్న గద్వాల పట్టణ పోలీసులు రంజిత్‌ను ఆయన నివాసం వద్ద అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ నాయకుడి అరెస్టు విషయం తెలుసుకున్న పోరాట సమితి నాయకులు ఆయనకు మద్దతుగా రాజా వద్దకు చేరుకున్నారు. బుచ్చిబాబు, నాగరాజు, రంగస్వామి, తదితరులున్నారు.



అరెస్టు చేసే ముందు రంజిత్‌కుమార్‌తో మాట్లాడుతున్న పోలీసులు

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

● పంచాయతీల్లో 255.. పట్టణాల్లో 77
● జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదానికి జాబితా



గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారి సొంతింటి కలలను నెరవేర్చేందుకు కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. వాస్తవంగా ఈ కమిటీలను గ్రామసభల ద్వారా నియమించాల్సి ఉన్నా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో కమిటీలకు తుది రూపు ఇచ్చారు. నివేదికను కలెక్టర్ అందించారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించిన విషయం విదితమే. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లించనున్నారు. పురపాలక సంఘాల్లో, పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలు, అధికారులు కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

నియామకం ఇలా: కమిటీల్లో సర్పంచులకు స్థానం కల్పించాల్సి ఉంది. కానీ పాలక వర్గం పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో కమిటీలోకి ప్రత్యేక అధికారులకు చోటుకల్పించారు. మొత్తంగా ఐదుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు ఉండాలని ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు ఎంపిక చేయడంతో పాటు పంచాయతీ కార్యదర్శికి స్థానం కల్పించారు. అలాగే పురపాలక సంఘాలలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురు సభ్యులను కమిటీల్లో నియమించారు. ఎవరైనా అనర్హులు పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి, రికవరీ చేసే అధికారం కూడా ఇచ్చారు. ఏర్పాటైన కమిటీలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉంది.

జిల్లాలో 7 వేల ఇళ్లు: నియోజకవర్గానికి 3,500 చొప్పున 7వేల ఇళ్లను జిల్లాకు మంజూరు చేయనున్నారు. మొత్తం 255 పంచాయతీలు.. 4 పురపాలక సంఘాల పరిధిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటును పూర్తిచేశారు. గద్వాల నియోజకవర్గంలో 131, అలంపూర్ నియోజకవర్గంలో 124 మొత్తం 255 కమిటీలను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘాల్లో ప్రతి వార్డుకు ఒకటి చొప్పున గద్వాలలో 37, అయిజలో 20, అలంపూర్‌లో 10, వడ్డేపల్లిలో 10 ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు మార్గదర్శకాలు పాటించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నాయి. దరఖాస్తుదారుడు పేద, మధ్య తరగతికి చెందిన వారై ఉండాలి. తప్పని సరిగా తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలి. అద్దె ఇంట్లో ఉంటున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం ఇవ్వడంతో పాటు సొంత స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించింది. గ్రామసభలు నిర్వహించి దరఖాస్తుల పరిశీలన అనంతరం కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

రూ.1.20 కోట్ల జరిమానా ఏమైనట్లు?

చౌడమ్మకుచ్చ మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోని నాటి ఏడీ



చౌడమ్మకుచ్చ మట్టి పోసి చదును చేసిన వెంచర్ ఇదే

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు బాలనగర్‌లోని ఓ రియల్ వెంచర్‌లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చారని, ప్రభుత్వానికి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్.. ప్రస్తుతం జనగామ జిల్లా ఏడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం కలకలం రేపింది. ఆరాతీస్తే ఆయన మహబూబ్‌నగర్ పట్టణం ఎదిర సమీపంలోని చౌడమ్మకుచ్చను అక్రమంగా తవ్వి భారీ మొత్తంలో మట్టి తరలించిన మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారిపైనా చర్యలు తీసుకోలేదని, వారి నుంచి జరిమానా వసూలు చేయకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టారని తెలిసింది. విచారిస్తే ఇలాంటివి చాలా వెలుగుచూసే అవకాశముంది.

మట్టి రవాణా : సరిగ్గా రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ చుట్టూ మట్టి మాఫియా రెచ్చిపోయింది. కంటికి కనిపించిన గుట్టలన్నీ కరిగించేసింది. అక్రమంగా మట్టిని తరలించి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. 2022 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎదిర శివారులో చౌడమ్మకుచ్చను మట్టి మాఫియా చెరబట్టింది. రాత్రింబవళ్లు ఇక్కడి నుంచి మట్టిని టిప్పర్లలో తిరుమల హిల్స్‌లో అప్పటి కీలక నేతకు బినామిగా చెలామణి అవుతున్న ఓ స్థిరాస్తి వ్యాపారి వెంచర్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన ఎదిరవాసులు 'న్యూస్‌టుడే'కు సమాచారం ఇచ్చారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేసి 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పటి మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ స్పందించారు. మరుసటి రోజైన 10వ తేదీన తమ సిబ్బందితో వెళ్లి చౌడమ్మకుచ్చతో పాటు మట్టిని తరలించి పోసిన తిరుమల హిల్స్‌లోని వెంచర్‌ను కూడా పరిశీలించారు. టిప్పర్లతో వెంచర్‌లో పోసిన మట్టి ఎత్తు 2.50 మీటర్లు, పొడవు 350 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉన్నట్లు కొలతలు వేసి గుర్తించి దాదాపు 60,375 టన్నులు ఉంటుందని తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.20 చొప్పున 10 రెట్ల జరిమానా విధిస్తామని, ప్రభుత్వానికి రూ.1,20,75,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జరిమానాను మట్టి తరలింపునకు కారణమైన వ్యక్తులు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసి వసూలు చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఏడీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకోకపోవడంపై మరోమారు 'న్యూస్‌టుడే' ఏడీ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ మైనింగ్ శాఖ నియమావళిని వివరించే ప్రయత్నం చేశారు.

కార్యాలయంలో కనిపించని దస్త్రాలు : మట్టి తరలింపుపై ప్రస్తుత మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అలాంటి దస్త్రాలు, జరిమానా వసూలు చేసిన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. మట్టి తరలించే పనిని జడ్చర్ల, అప్పన్నపల్లికి చెందిన కొందరు టిప్పర్ల యజమానులకు స్థిరాస్తి వ్యాపారి అప్పగించారు. ఒక్కో లోడుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర నిర్ణయించడంతో రాత్రింబవళ్లు తిరుమల హిల్స్‌లో వెంచర్‌కు మట్టిని తరలించారు. నేతల ఆశీర్వాదంతో కేసులే కాదు.. జరిమానా కూడా చెల్లించకుండా టిప్పర్ల యజమానులు తప్పించుకోవటం గమనార్హం.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై నీలి శ్రీనివాసులు, సంపత్‌కుమార్, సరిత తదితరులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలో నిరంకుశత్వం, నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణతో పాటు కృష్ణవేణి చౌక్‌లో ఏర్పాటుచేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2లక్షలపైన ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉందని అది కూడా చేస్తామన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయని వాళ్లకు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రకటిస్తామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా వారే కావడంతో ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరితలు మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, పుర ఛైర్మన్ బీఎస్ కేశవ్, టీపీసీసీ సభ్యుడు శంకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు ఇసాక్, షెక్షావలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు..: ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గైర్హాజరవటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంపైనా చర్చించుకోవడం కన్పించింది.

అయిజలో బస్ డిపో ఏర్పాటుచేయండి

అయిజ, న్యూస్‌టుడే: అయిజ పట్టణంలో ఆర్టీసీ బస్‌డిపో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్టాండులో ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచాలని, బస్టాండు ఆవరణలో సీసీ రోడ్డు వేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం గద్వాలలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు పైచదువులు చదవలేకపోతున్నారన్నారు. అయిజ బస్టాండులో 60కి పైగా దుకాణాలున్నాయని వాటి నుంచి ఆదాయం వస్తున్నా బస్టాండును అభివృద్ధి చేయడంలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడి ప్రజల సౌకర్యార్థం అభివృద్ధిపనులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పీపీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలిఆచారి, పార్టీ పట్టణాధ్యక్షుడు మధుకుమార్ పాల్గొన్నారు.

మెప్మా సీవో యాదయ్యపై వేటు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్య వ్యవహారంలో మెప్మా సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్) జి.యాదయ్యపై వేటు పడింది. ఆ విధుల నుంచి ఆయన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల దస్త్రం మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డికి చేరింది. మహిళల పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల నగదును సొంతానికి వాడుకున్న ఆర్పీ శ్రీలతపై ఠాణాలో కేసు నమోదు చేయడంతోపాటు డబ్బు రికవరీ చేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో డబ్బు దుర్వినియోగంపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనాలతో స్పందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి మెప్మా సీవోలతో సమీక్ష నిర్వహించారు. ఆర్పీ శ్రీలత రూ.కోట్లలో మహిళల సొమ్ము పక్కదారి పట్టిస్తే సీవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోయనగర్ వ్యవహారంలో సంఘాల సభ్యులు నష్టపోరాదని, అక్రమాలకు పాల్పడ్డ ఆర్పీపై క్రిమినల్ చర్యలు తప్పవని, మిగతా ఆర్పీలపై సీవోలు దృష్టి సారించాలని సూచించారు. ఈ వ్యవహారంపై తుది నివేదిక రాగా కలెక్టర్, అదనపు కలెక్టర్.. మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. కోయనగర్ సమాఖ్యలో మూడేళ్లుగా జరుగుతున్న అవకతవకలు గుర్తించడంలో సీవో యాదయ్య పూర్తి నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా పనిచేశారని గుర్తించిన కలెక్టర్ అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో 25 కేంద్రాలు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: వచ్చే నెల 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్ 3 పరీక్షకు హాజరయ్యే 8,700 మంది అభ్యర్థులకు జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం టీజీపీఎస్సీ రాష్ట్ర ఛైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గద్వాల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ అంశాలు వివరించారు. రెండు రోజుల పాటు జరిగే గ్రూప్ 3 పరీక్షల నిర్వహణకు సంబంధితాధికారులు సమన్వయంతో పని చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8,700 మంది అభ్యర్థులు హాజరయ్యే పరీక్షలకు 25 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది పరిశీలకులు, ఐదుగురు ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌లు విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



వీసీలో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ నర్సింగరావు, పరీక్షల సమన్వయకర్త రామ్మోహన్‌రావు తదితరులు

జూరాలకు కొనసాగుతున్న వరద



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

ధరూరు, శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 11 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం కలిపి 83 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 51 వేలు చేరుతుండగా దిగువకు 45 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరో రెండు రోజుల పాటు వరద కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తుంగభద్ర: నదిలో ప్రస్తుతం 53,270 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 11.2 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయం నుంచి 68 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి 5.5 అడుగులు వస్తోంది.

● సుంకేశుల జలాశయం నుంచి 10 గేట్ల ద్వారా 42,420 క్యూసెక్కులు, కేసీ కాల్వ ద్వారా 2,095 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలోకి 43,560 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతోందని వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అగ్నిమాపక దళ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగిసి పడినపుడు ఆందోళనకు గురికాకుండా చాకచక్యంగా ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టాలో అధికారులు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు భయానికి గురికాకుండా ఉండాలని సూచించారు. ప్రిన్సిపల్ కలందర్‌బాష, అగ్నిమాపక అధికారి రాకేష్, అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

ఆర్టీసీకి దసరా బొనాంజా

16 రోజుల్లో రూ.39.22 కోట్ల ఆదాయం



ఆర్టీసీ ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ (గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ దసరా పండగ సందర్భంగా ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం వి.శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 16 రోజుల పాటు ఆర్టీసీకి వివిధ డిపోల వారిగా ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లా (రీజియన్) వ్యాప్తంగా 740 బస్సులను వివిధ రూట్లలో 52.72 లక్షల కిలోమీటర్లు నడిపి 69.83 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.39.22 కోట్ల రాబడి వచ్చిందని ఆర్ఎం తెలిపారు. ఇందులో రూ.4.73 కోట్లు టోల్‌ప్లాజా, సెస్, ఇతర వస్తువుల రవాణా ద్వారా, మరో రూ.34.49 కోట్లు ప్రయాణికుల ద్వారా సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం ఆర్టీసీ రీజియన్‌లోనే సరికొత్త రికార్డు అన్నారు. 14వ తేదీ ఒక్క రోజే 138 శాతం ఆక్యుపెన్సీతో రీజియన్‌లో ఆర్టీసీకి రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది కూడా ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డు అన్నారు. పండగ సందర్భంగా రాష్ట్రస్థాయిలోనూ మహబూబ్‌నగర్ రీజియన్ 110 శాతం ఆక్యుపెన్సీ సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం తెలిపారు.

వివిధ డిపోల వారిగా వచ్చిన ఆదాయం ఇలా

డిపో పేరు	కి.మీలు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
అచ్చంపేట	4.92	315.88
గద్వాల	6.26	415.04
కల్వకుర్తి	6.16	388.36
కొల్లాపూర్	4.21	265.27
కోస్గి	0.73	42.44
మహబూబ్‌నగర్	8.00	519.55
నాగర్‌కర్నూల్	5.06	353.98
నారాయణపేట	5.54	347.10
షాద్‌నగర్	4.83	316.55
వనపర్తి	7.01	485.28
మొత్తం	52.72	3449.45

అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-23 ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్లతో ఎంపీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ (గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలకు జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఆరు జట్లను ఎంపిక చేసింది. 28వ తేదీ వరకు ఈ ఆరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో 'హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రంజీ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు సురేష్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వేడుక మాటున వేదన



ఆనందాన్ని ఎవరు కోరుకోరు? కానీ ఎంత మోతాను...? మన సరదా ఎదుటివారి ఆరోగ్యంతో ఆడుకోడానికి కాదు కదా! ఉమ్మడి జిల్లాలో కొంతమంది కుర్రకారు చేస్తున్నదేమిటి? ఉత్సవం, ఊరేగింపు, పెళ్లి.. కార్యక్రమం ఏదైనా.. డీజే మోత మోగిస్తున్నారు.. వృద్ధులు, పిల్లలు, వ్యాధిపీడితులు తల్లడిల్లిపోతున్నారు.

న్యూస్‌టుడే- కోస్గి, పాతబస్టాండ్(నారాయణపేట)

డీజే శబ్దాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. అతి భయంకర ధ్వనులు చెవులను దెబ్బతీస్తున్నాయి. పలువురు యువకులు వాటి ముందు ఎక్కువ సమయం నృత్యాలు చేయడంతో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా డీజేల పట్ల ఆకర్షితులవుతున్నారు. శ్రుతిమించిన ధ్వనులతో ఇబ్బందులు పాల్పడుతున్నారు.



నారాయణపేటలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేస్తున్న యువకులు

● వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమళ్ల గ్రామంలో 28 ఏళ్ల యువకుడు దసరా ఉత్సవాల శోభాయాత్రలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేశాడు. ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

● **ధరూర్:** రేవులపల్లిలో ఇటీవల డీజే శబ్దాల మధ్య బతుకమ్మలను ఊరేగిస్తుండగా సౌండ్ తగ్గించాలని ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశాడు. అతనితో ఊరేగింపు నిర్వాహకులు గొడవపడ్డారు. వారించడానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను కత్తితో పొడిచారు.

మీకు తెలుసా..?

● మహారాష్ట్రలోని గాంధీ చౌక్ వద్ద జరిగిన ఓ ఉత్సవంలో ఎక్కువ సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేశారు. వాటి శబ్ద ప్రభావంతో 250 మంది చెవిపోటుకు లోనయ్యారు. వీరిలో చాలా మందికి చెవుడు వచ్చింది.

మనం ఏం చేయాలి?



● చిన్న శబ్దంతో డీజేలు వాడుకుంటే ఇబ్బంది ఉండదన్న విషయాన్ని యువతకు అవగాహన కల్పించాలి.

● చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన సరదా కోసం ఎదుటివారి జీవన హక్కును దెబ్బ తీసినట్లేనని గుర్తించాలి. అర్ధరాత్రి మోతమోగిస్తే ఎక్కువమందికి నిద్రాభంగం కలుగుతుంది.

● ఉమ్మడి జిల్లాలో పోలీసులు డీజే శబ్దాలపై ప్రకటనలు చేస్తున్నా, వాస్తవానికి పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్లయితే ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపేరును నిర్వాహకులకు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

చెవులు చిల్లులు

బ్లూటూత్, రిమోట్ వంటి పరికరాలతో డీజేలను నియంత్రించే పద్ధతి రావడంతో శబ్ద కాలుష్యం తోపాటు రేడియేషన్ ప్రభావం ఉంటోంది. మానసిక సమస్యలు, వ్యాకులత కూడా కలుగుతున్నాయి.

శబ్ద తీవ్రతను డెసిబెల్స్‌లో కొలుస్తారు. డెబ్బై డెసిబెల్స్ తీవ్రత ఉన్న శబ్దాలను చెవులు తట్టుకోగలుగుతాయి. ఆపై పెరిగితే ప్రమాదం తప్పదు. 80 నుంచి 100 డెసిబుల్స్ మధ్య చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. వంద నుంచి 120 డెసిబుల్స్ మధ్య రక్తపోటు పెరిగి గుండె లయ తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మనిషిలో కూడా పక్షవాతంపై ధ్వని ప్రభావం చూపుతుంది.

మన జిల్లాలో వినాయక, బతుకమ్మ, దుర్గామాత ఉత్సవాల్లో సౌండ్‌బాక్స్‌లను పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. పల్లెల్లోనూ కొంతమంది డీజేలను కొనుగోలు చేసి అద్దెకు ఇస్తున్నారు. ప్రాంతం బట్టి ఒక రోజు స్థాయిని అనుసరించి రూ.20 నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు.

నిబంధన అమల్లో ఉంది



హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో డీజేలపై నిషేధం ఇప్పటికే అమల్లో ఉంది. పోలీసులు ఎంతచెప్పినా ప్రజలు సహకరించుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదు. డీజేల నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి శబ్దకాలుష్యం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- నల్లపు లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

చెవుడు వచ్చే ప్రమాదం



ఎక్కువ శబ్దం, ఎక్కువ సేపు వింటే తరంగాలు చెవుల్లో మోత మోగించడంతోపాటు కర్ణభేరి దెబ్బతింటుంది. వినికిడి సమస్యలు తలెత్తుతాయి. మానసిక ఒత్తిడి, వ్యాకులత పెరుగుతుంది. ఇది మానసిక సమస్యలకు దారితీస్తుంది. చెవుడు వంటి సమస్యలతో పాటు, గుండె పోటుకు ఆస్కారం ఉంటుంది. హృదయ సమస్యలు ఉన్నవారు ఎక్కువ శబ్దాలను వినలేరు. వారిని దృష్టిలో ఉంచుకోవాలి. మెదడు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీలైనంత వరకు తక్కువ శబ్దాలతో, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేస్తే మంచిది.

- డా.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్యుడు.

292 సెక్షన్ బీఎన్ఎస్ కింద శిక్షార్హులు



పరిమితికి మించిన శబ్దాలున్నవ్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సెక్షన్ 292 బీఎన్ఎస్ కింద శిక్షార్హులవుతారు. వాణిజ్య ప్రాంతాలు, జనసంచారం ఉండే నివాసిత ప్రదేశాలు, రాత్రి వేళల్లో నిబంధనలకు లోబడి శబ్దం ఉండాలి. పరిమితికి మించి శబ్దం పెంచితే రూ.200 నుంచి రూ.2వేల వరకు కోర్టు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజాజీవనానికి భంగం కల్గిస్తే మరికొన్ని తీవ్ర శిక్షలు, సెక్షన్లు వర్తిస్తాయి.

- కె.రాజశేఖర్, న్యాయవాది నారాయణపేట

చెల్లియో చెల్లక

న్యూస్‌టుడే- ఊట్కూరు, పాలమూరు

బాబూ! ఈ పది రూపాయల బిళ్ల తీసుకుని చెరుకు రసం ఇవ్వు.
కుదరదమ్మా.. అది చెల్లదు. నోటు ఉంటే ఇవ్వు...
అదేంటి బాబూ
ఎళ్లి గవర్నమెంట్‌ను అడుగు...
- ఇలాంటి సన్నివేశాలు ఉమ్మడి పాలమూరులో చాలాచోట్లు చూస్తూనే ఉన్నాం.
పది రూపాయల నాణేలు ఎంచక్కా వాడుకోవచ్చు.
ఎవరైనా అభ్యంతరం పెడితే ఫిర్యాదు చేసే వీలుంది.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదిరూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ● ప్రయాణికులు ఇచ్చే రూ. 10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలను జారీ చేశారు. ● మక్తల్ పట్టణంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో కూడా రూ. 10, రూ.20 నాణేలను తీసుకోవటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అవగాహన రాహిత్యం వల్ల కొంత మంది ప్రజలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లో దుకాణదారులకు రూ.10 నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు



అసలేం జరిగింది

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్దనోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయాల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలామంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులు లేపారు.

బ్యాంకుల్లో రూ.16 కోట్ల నాణేలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 16 కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నాయి. పలు ప్రైవేటు, అనుబంధ సంస్థల బ్యాంకులలో మరో రూ. 10 కోట్ల నాణేలు ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్‌బీఐ బ్యాంకుల్లో రూ.2.5 కోట్ల రూ.10 నాణెలు, యూనియన్ బ్యాంక్‌ల్లో రూ. 2కోట్లు నాణేలు ఉన్నట్లు ఆ వర్గాల సమాచారం.

అవగాహన విస్తృతం చేయాలి



మా దుకాణానికి సరకుల కోసం వచ్చే కొంత మందికి రూ. 10 నాణెం ఇస్తే తీసుకోవటం లేదు. ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు. కొంత మంది తీసుకెళ్లి, ఎవ్వరూ తమవద్ద తీసుకోకపోతే తిరిగి ఇస్తున్నారు. ప్రజల్లో అపోహలు తొలగిపోవాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు పెడుతున్నారు. అందులో ఈ విషయం చెప్పాలి. షీటీంలు, ఇతరశాఖల అవగాహన సదస్సుల్లో ఇదో అంశంగా చేస్తే బాగుంటుంది.

- ఎస్.మధుకర్, కిరాణా దుకాణదారుడు, ఊట్కూరు.

నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి



దుకాణదారులైనా, వ్యాపార సంస్థలైనా , వ్యక్తులైనా రూ. 10, రూ. 20 నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోనో, లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. అందరం కలిసి అసత్య ప్రచారాలను ఆపుదాం.

- కాల్వ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్, మహబూబ్‌నగర్.

'పాలమూరు'పై సీఎంకు చిత్తశుద్ధి ఏదీ?: నాగం



నాగర్‌కర్నూల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నార్లపూర్, వట్టెం, కర్వెన జలాశయాలను నీటితో నింపాలని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు దాటినా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన మూడున్నర కిలో మీటర్ల సొరంగం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం ముగిసే వరకు పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 9న కూడికిళ్ల వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో పత్తి సాగు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహార నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ, హైడ్రా పరిపాలన బంద్ చేసి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని కాల్వల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వెళ్లేలా వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డా. నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బాలగౌడ్, ఐతోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి పొలానికి పురుగు మందు పిచికారీ చేసిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మంగళి ఆంజనేయులు(46) గురువారం తన పత్తిపొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేశాడు. దీంతో రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్సకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులుకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



శైలేష్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల, రాయిపాకుల దారిలో శుక్రవారం ఉదయం బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో వెన్నచర్లకు చెందిన సంపంగి హన్మంతు చిన్నకుమారుడు సంపంగి శైలేష్ (18) మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వెన్నచర్ల నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శైలేష్ బండరాయిపాకుల సమీపంలో బస్సును అధిగమించబోయి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యువకుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పిడుగు పాటుకు కూలీ...



సంగమ్మ

మరికల్ కూడలి : పిడుగు పడి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మరికల్ మండలం కన్మనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం... శెర్నపల్లి గ్రామానికి చెందిన రైతు కన్మనూర్ శివారులో కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కర్నాటక రాష్ట్రంలోని గురిమిట్కల్ తాలుకా పరిధిలోని అన్వార్ గ్రామానికి చెందిన మహిళలను పత్తి తీసేందుకు శుక్రవారం తీసుకొచ్చాడు. మధ్యాహ్నం వర్షం పడడంతో వారు ఓ చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడగా బోయ సంగమ్మ(45) అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. మల్లమ్మ, అల్లమ్మ అనే మహిళలకు గాయాలై అస్వస్థతకు గురయ్యారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే కూలీలను తీసుకొచ్చిన వాహనంలోనే మృతదేహం, గాయపడిన వారిని తరలించారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజుతో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ.. కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారని వివరించారు.

పీయూలో సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల కోసం ఎంపికలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీయూలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పురుషుల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీరాములు (కొల్లాపూర్), జగదీశ్ (నారాయణపేట), బడేసాబ్ (మహబూబ్‌నగర్), శివకృష్ణ (నారాయణపేట), రాకేశ్ (మహబూబ్‌నగర్) తదితర క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీలు సత్య భాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి(25) శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీతకే సీఎం కప్



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ మంచి వేదిక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ స్వాగతం పలికారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడా సాధనతో శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్.. దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, అయిజ: శివసాయి : దేవర, భువనేశ్వర్ : విశ్వం, మాధవ్ : వేట్టయన్
-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

సంకల్పంతోనే విజయం

గద్వాలలో 'ఈనాడు ప్రతిభా పాటవ' పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న ప్రగతి పాఠశాల విద్యార్థులు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: సంకల్పంతో పాటు సాధించాలన్న తపన ఉంటే విజయాలు వాటంతటవే వరిస్తాయని గద్వాల ప్రగతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సవారన్న, శారద ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు' నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై ఈ రెండు పాఠశాలలో వేర్వేరుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రగతి పాఠశాలలో నిర్వహించిన పోటీలో మొదటి స్థానంలో శివానిగౌడ్, రెండో స్థానంలో గాయత్రి, మూడో స్థానంలో శ్రుతి నిలిచి తమ ప్రతిభను చాటుకున్నారు. శారద పాఠశాలలో నిర్వహించిన పోటీలో మొదటి స్థానంలో ఆర్తి, రెండో స్థానంలో శివాంజలి, మూడో స్థానంలో స్వప్న నిలిచారు. విజేతలకు ఆయా కరస్పాండెట్లు, నిర్వాహకులు బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు సత్యన్న, సాజిద, షహీనాబేగం, ఊర్మిళ, వెంకటేశ్, భారతి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సవారన్న..


బహుమతులు అందజేస్తున్న శారద పాఠశాల కరస్పాండెంట్ బాబునాయుడు

ఆలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి


పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అలంపూర్, ఇటిక్యాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు సేవలు చేయడానికి అనుకూల పరిస్థితి కల్పించాలని, శక్తి ఇవ్వాలని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజల సహకారంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు స్థలం సేకరించామని, త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అమ్మ వారి సన్నిధి నుంచి హారతి అనంతరం భక్తులు సులభంగా తిరిగి వెళ్లేందుకు అలంపూర్ చౌరస్తా వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు పూర్వం మంత్రి దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఆర్డీవో రామచందర్ స్వాగతం పలికారు.

ఘన స్వాగతం: జిల్లా పర్యటనలో భాగంగా ఎర్రవల్లికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు జోగుల రవి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పదోన్నతిపై అలంపూర్ న్యాయమూర్తి బదిలీ


న్యాయమూర్తి కవితను సన్మానిస్తున్న న్యాయవాదులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవితకు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వనపర్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కవితకు శుక్రవారం న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, అలంపూర్ కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గద్వాల నుంచి వచ్చిన న్యాయమూర్తి ఉదయ్ నాయక్‌ను సైతం సన్మానించారు. తన సర్వీసులో అలంపూర్‌ను మరిచి పోలేనని న్యాయమూర్తి కవిత పేర్కొన్నారు. అలంపూర్ ఇన్‌ఛార్జి న్యాయమూర్తి ఉదయ్ నాయక్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సర్వసాధారణమన్నారు. న్యాయవాదులు నారాయణరెడ్డి, యూదు ర్యాషతిమ్మరెడ్డి, నాగరాజుయాదవ్, శ్రీనివాసులు, ఏజీపీ మధు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయుడు, అధికారులు

మానవపాడు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. మండలంలోని కలుకుంట్ల గ్రామం నుంచి అమరవాయి వరకు 5 కి.మీ. బీటీ రెన్యువల్ పనులు రూ.3.33 కోట్లతో శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గుత్తేదారు పనులు నాణ్యతగా చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. రోడ్లు, భవనాల శాఖ ఈఈ ప్రగతి, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ రాజేశ్వరి, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత: బోరవెల్లి గ్రామానికి చెందిన కుర్వ అశోక్ శస్త్రచికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే లబ్ధిదారుకు అందజేశారు. భారాస నాయకులు శేషిరెడ్డి, రఘురెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీ బ్యాంకు క్షేత్రసహాయకునిపై విచారణ

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: ఏపీజీవీ బ్యాంకు క్షేత్రసహాయకుడు రైతులకు మధ్యవర్తుల ద్వారా రుణాలు మంజూరు చేశారనే ఆరోపణలపై శుక్రవారం నాగర్‌కర్నూల్ నుంచి వచ్చిన చీఫ్ మేనేజర్ అన్వేష్ విచారించారు. గతనెల 21, 22 తేదీల్లో కొంకల, జూలేకల్ రైతులు బ్యాంకు ఉన్నతాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అన్వేష్ దస్త్రాలు పరిశీలించి, రైతుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. రైతులు నేరుగా రుణాల కోసం వెళితే సతాయించారని, మధ్యవర్తులు సూచించిన వారికే రుణమాఫీ ముందుగా వర్తింపజేసి ఏదో కొర్రి పెట్టి మిగిలిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు తెలిపారు. క్షేత్రసహాయకుడిని వెంటనే బదిలీ చేయాలని డిమాండు చేశారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణాధికారి అన్వేష్ తెలిపారు. సాయంత్రం జూలేకల్ వెంకటేశ్ అనే ఫిర్యాదుదారు బ్రాంచి మేనేజర్ నుంచి ఫిర్యాదు పత్రం వెనక్కు తీసుకెళ్లారని సమాచారం.

పనికి తగ్గవేతనం ఇవ్వాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ సభ్యులు

ధరూరు, న్యూస్‌టుడే: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో గట్టు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయటమే కాకుండా ప్రతి మనిషికి 200 రోజుల ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రోజు కూలీ రూ.850 ఉండేలా చట్టాలను తేవాలని వారు డిమాండ్ చేశారు. గట్టు మాజీ ఎంపీపీ విజయ్‌తో కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు. ముని చంద్రగౌడు, ఆనంద్, హనుమంతు, కూలీలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రస్తుతమున్న ధ్వజస్తంభం కర్రది శిథిలమవుతున్నందున కొత్తది, ఇత్తడి తొడుగుతో ఏర్పాటు చేయడానికి గుంతకల్‌కు చెందిన భీమిరెడ్డి ముందుకు వచ్చారు. దీనికి రూ.5లక్షలు ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావుకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయన 2020లో ఆలయానికి రూ.15 లక్షల వ్యయంతో వసతిగృహాన్ని నిర్మించి ఇచ్చారు.

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారి



అయిజ మండలం సీటీపాడు గ్రామంలోని ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉంది. గతంలో సీసీ వేసినా నిర్వహణ లోపం కారణంగా రోడ్డునిండా గుంతలు పడి గుంతల్లో నీరు నిలిచి ఇలా తయారైంది. గ్రామంలోని ఇతర కాలనీలకు ఈ మార్గం ద్వారానే వెళ్లాలి. సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దెబ్బతిన్న రహదారుల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిధులను బట్టి మరమ్మతులు చేయించేందుకు కృషిచేస్తామని ఎంపీడీవో వెంకటయ్య తెలిపారు. -న్యూస్‌టుడే, అయిజ

పట్టపగలే వెలుగులు



రావుల్‌చెర్వులో పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. గ్రామంలోని స్తంభాలతో పాటు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు ఉన్న విద్యుత్తు స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేశారు. అయితే వాటికి ఆన్ ఆఫ్ లేకపోవడంతో నిరంతరాయంగా వెలుగుతున్నాయి. దీని వల్ల బల్బులు తొందరగా పాడవడంతోపాటు గ్రామ పంచాయతీకి బిల్లులు అధికమయ్యే అవకాశం ఉంది. దీనిపై ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్ వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, ఇటిక్యాల

ప్రహరీ నిర్మించండి సారూ



గోకులపాడు గ్రామంలో ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాల ఇది. మండలంలోని చందూరు, చంద్రశేఖర్‌నగర్, కలుకుంట్ల, నారాయణపురం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. చంద్రశేఖర్‌నగర్‌లో రెండు ప్రభుత్వ పాఠశాలలు అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఉన్నాయి. నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. విద్యార్థులు అనుకోకుండా రోడ్డుపైకి వస్తే ప్రమాదమే. విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని నిధులు మంజూరుకాగానే ప్రహరీల నిర్మాణం చేపడతామని ఎంఈవో శివప్రసాద్ తెలిపారు. -న్యూస్‌టుడే, మానవపాడు

వర్షాలతో పత్తికి నష్టం



ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పత్తి పంట దెబ్బతింటోంది. చేతికొచ్చిన పత్తి వర్షాలకు రంగుమారి నాణ్యత కోల్పోతోంది. సకాలంలో వర్షాలు కురియడంతో ఈ ఏడాది దిగుబడులు కాస్త మెరుగ్గా ఉన్నాయి. కానీ కోత సమయంలో వర్షాలు కురుస్తుండటం ప్రభావం చూపిస్తోంది. పొగాకు పంటకు కూడా ఈ వర్షాలు అంత మంచివికావని రైతులంటున్నారు. మరోవైపు ఈ వర్షం పప్పు శనగ పంటకు ఇది అనుకూలం కానుంది. జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పత్తి, పది వేల ఎకరాల్లో పొగాకు, ఇరవై వేల ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. -న్యూస్‌టుడే, అలంపూర్

పల్లెల్లో పరిశుభ్రత బాధ్యత కార్యదర్శులదే

మల్దకల్, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఉందని దీనిపై అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి శ్యామసుందర్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయం సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాగునీరు కలుషిత అవకుండా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డులకు చేరవేసే ప్రక్రియ ఆపకుండా కార్యదర్శులు చూడాలని పేర్కొన్నారు. ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, ఏపీవో సుజాత, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంఘం ఎన్నిక


మన్నాపురంలో సీఐటీయూ జెండావిష్కరణ

ధరూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మన్నాపురం గ్రామంలో హెవీ వెహికల్ డ్రైవర్ల సంఘం ఎన్నిక శుక్రవారం జరిగింది. సీఐటీయూ జిల్లా నేత వెంకటస్వామి సమక్షంలో సంఘాన్ని ఎన్నుకున్నారు. అనంతరం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాల వల్ల డ్రైవర్లకు భద్రత లేకుండా పోయిందన్నారు. అన్ని గ్రామాల్లో యూనియన్‌లు ఏర్పాటు కావాలన్నారు. దర్శెల్లి, సంఘం అధ్యక్షులు శ్రీను, కర్రెప్ప సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాదు విజయవంతానికి పిలుపు


అయిజ: అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలతో నాయకులు

అయిజ, శాంతినగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని 57 ఉపకులాల ఆధ్వర్యంలో ఈనెల 21న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త పల్లయ్య పేర్కొన్నారు. రిజర్వేషన్‌కు నోచుకోక ఏళ్లతరబడి నుంచి అణగారిన కులాల వారికి వెంటనే న్యాయం జరిగేలా ప్రభుత్వం వర్గీకరణ అమలు చేయాలంటూ ఇందిరా పార్కు వేదికగా నిరసన దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన వివరించారు. శుక్రవారం అయిజలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ ఉపకులాల నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కేశవరం మాజీ సర్పంచి కృష్ణ, ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటన్న, రాష్ట్ర కార్యదర్శి బాలరాజు, నాయకులు ఉరుకుంద, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు. ● ఏకసభ్య కమిషన్ ముందు తమ ఇబ్బందులు తెలియజేసేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు ఎంబీఎస్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటన్న తెలిపారు. సంబంధించిన కరపత్రాలు శాంతినగర్‌లో విడుదల చేశారు. బాల్‌రాజు, అకుల రామచంద్రుడు, దాసరి, నాగరాజు, నర్సింహులు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి, న్యూస్‌టుడే: హోలియ దాసరి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్ సమక్షంలో శుక్రవారం ఉండవల్లిలో కరపత్రికను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును యథాతథంగా అమలు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి నాగరాజు, మదాసి కురువ ఎంబీఎస్సీ రాష్ట్ర కార్యదర్శి బాల్‌రాజ్, బీమన్న, వేణుగోపాల్, ప్రభాకర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


శాంతినగర్: కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్సీ ఉపకులాల నాయకులు

ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దుకు డిమాండ్

భూత్పూర్, న్యూస్‌టుడే : విద్యా, ఉద్యోగ రంగాల్లో అగ్రవర్ణాలకు ఇస్తున్న ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేయాలని బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. భూత్పూర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రవర్ణాల్లో పేదలు 2 శాతమేనని, వారికి 10 శాతం కోటా ఇవ్వడం సరికాదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, నాగన్న, గోపాల్, శ్రీనివాస్, నరేందర్, రవి పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్ రెడ్డి, చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ రాష్ట్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించడాన్ని టీఎన్జీవోల సంఘం జిల్లా కమిటీ స్వాగతిస్తోందన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు

దేవరకద్ర గ్రామీణం : ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకులు వర్గీకరణపై మాట్లాడకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో జంబులయ్య, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

30న సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 30న పాన్‌గల్‌లో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం వనపర్తిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర నాయకులు యం.డి యూసఫ్, ఉమామహేశ్వర్, విజయరాములు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కళావతమ్మ, గోపాలకృష్ణ, జయమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

రెండు బృందాలతో పశువులకు టీకాలు


టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ మండల పరిధిలో వచ్చే నెల 14వ తేదీ వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి శంకరయ్య తెలిపారు. రెండు టీమ్‌లుగా ఏర్పడి మండల పరిధిలోని గ్రామాల్లో టీకాలు వేస్తున్నారని, పశువులకు గాలి కుంటు వ్యాధి సోకుతే విపరీతమైన జ్వరం వస్తుందన్నారు. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం, కాడిఎద్దులు వ్యవసాయం చేయడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు.

బాలానగర్‌కు ధర్మ ప్రచార సైకిల్ యాత్రికులు

బాలానగర్, న్యూస్‌టుడే : ధర్మప్రచారమే లక్ష్యంగా బెంగుళూర్‌లోని వైట్ ఫీల్డ్స్‌కు చెందిన 13 మంది యాత్రికులు కర్ణాటక నుంచి అయోధ్య రామ మందిరం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. శుక్రవారం ఈ యాత్ర మండల కేంద్రానికి చేరుకుంది. బృందం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోజుకు 120 కి.మీ ప్రయాణం చేస్తుంటామని, మరో 16 రోజుల్లో అయోధ్యకు చేరుకుంటామని తెలిపారు.


సైకిళ్లపై అయోధ్యకు వెళుతున్న యాత్రికులు

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మనోహర్‌నాయుడు

మల్దకల్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు యువకులకు మానసికోల్లాసంతో పాటు క్రీడలపై అసక్తి పెంచుతాయని వాల్మీకి సంఘం జిల్లా నాయకుడు మనోహర్‌నాయుడు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మద్దలబండలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. మొదటి బహుమతి బిజ్వారం గ్రామానికి చెందిన టీంకు రాగా డి.శేఖర్‌నాయుడు రూ.10,016 అందజేశారు. ద్వితీయస్థానం మద్దలబండ వాల్మీకి టీంకు రాగా రూ.6,116 మనోహర్‌నాయుడు అందజేశారు. మూడో బహుమతి రూ.3,116 బిజ్వారం టీంకు ఎంబీ కిష్టన్న అందజేశారు. అయిదో బహుమతి ఛైర్మన్ సిద్ధు అందజేశారు. గ్రామపెద్దలు, వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.


విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న నిర్వాహకులు

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అవసరం

ధరూరు, న్యూస్‌టుడే: గ్రామాల సంస్కృతిని ప్రతిబింబించే పోటీలకు ప్రోత్సాహం ఇవ్వాలని ర్యాలంపాడు వాల్మీకి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన సందె రాళ్ల పోటీలు శుక్రవారం ముగిశాయి. మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గ్రామనేత పురుషోత్తంరెడ్డి సహకారంతో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉన్నతంగా రాణించాలి

ఉండవల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌జీఎఫ్‌లో భాగంగా 3 రోజుల పాటు పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు టీ షర్టులను (జెర్సీ) ఎమ్మెల్యే విజయుడు స్థానికులతో కలిసి అందజేశారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



పుల్లూరు జడ్పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులతో ఎమ్మెల్యే

నైపుణ్యం వెలికితీసేందుకు సీఎం కప్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం కప్ ఎంతో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. సెప్టెంబరులో ప్రారంభం కానున్న సీఎం కప్ సంఘీభావ ఊరేగింపును శుక్రవారం వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరుగుతాయన్నారు. విజేతలు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడా ఇన్‌ఛార్జులు గోకుల్, రతన్‌కుమార్ బోస్, మధు, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని అందుకుంటున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, చిత్రంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

బాలుడి అప్పగింత


పెబ్బేరు పోలీస్‌స్టేషన్ వద్ద బాలుడిని తీసుకొన్న వెంకటేష్ శెట్టి

పెబ్బేరు, న్యూస్‌టుడే : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బోయ్యగూడెం గ్రామానికి చెందిన రమాదేవి కుమారుడు పృథ్వీక్ తో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు ఎర్రవల్లికి వచ్చారు. వరుసగా మూడు బస్సులు రావడంతో ఆమె ఓ బస్సులో.. కుమారుడు మరో బస్సులో ఎక్కారు. ప్రయాణికులు కిక్కిరిసి ఉండటంతో తల్లి గమనించలేదు. పృథ్వీక్‌ను ఓ వృద్ధురాలు గమనించి అతనితో కలిసి పెబ్బేరు బస్టాండులో దిగి అక్కడ ఉన్న మహిళా కానిస్టేబుల్ ప్రభావతికి అప్పజెప్పి పరిస్థితి వివరించారు. ఆమె ఠాణాకు తీసుకొచ్చి ఎర్రవల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు సేకరించి చరవాణి ద్వార రమాదేవిని, తాత వెంకటేశ్‌శెట్టిని పిలిపించి బాలుడిని పోలీసులు అప్పగించారు.